

పాడేరులో పొగమంచు

జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు కురిసింది. దీంతో రోడ్డు మార్గం సరిగా కన్పించక వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొగమంచుతో పాడేరు, పరిసర ప్రాంతాలు ఆహ్లాదంగా దర్శనమిచ్చాయి.

-పాడేరు/ఆంధ్రజ్యోతి

పాడేరు మెయిన్‌రోడ్డులో పొగమంచు



ధనలక్ష్మిగా శ్రీకనకమహాలక్ష్మి

నగరంలోని బురుజుపేటలో గల శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం ధన లక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని లక్ష చామంతి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి ప్రత్యేకంగా అలంకరించిన పట్టు చీరలను లక్కీ షాపింగ్‌మాల్, సౌత్ ఇండియా మాల్ అధినేతలు సమకూర్చారని ఈవో కె.శోభారాణి తెలిపారు. కనకమహాలక్ష్మి అమ్మవారు శనివారం ధాన్యలక్ష్మిగా దర్శనమివ్వనున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

రుణాల వసూళ్లు నిలుపుదల

కలెక్టర్ దినేశ్‌కుమార్

- ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా గుర్తించిన ప్రభుత్వం
- రైతుల రుణాలు రీషెడ్యూల్
- కాఫీ, మిరియాల రైతులకూ పంట రుణాలు



బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడాదిపాటు రుణాల వసూళ్లను నిలుపుదల చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ప్రకటించారు. బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుస వరదలు సంభవించిన నేప థ్యంలో జిల్లాను ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందువల్ల ఏడాదిపాటు జిల్లాలో రుణాల వసూలుపై మారటోరియం అమలవుతుందన్నారు. ఫలితంగా రైతులు తమ రుణాలను రీషెడ్యూల్ చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులు, కొత్త రైతులను గుర్తించి బ్యాంకులు రుణాలు అందించాలన్నారు. అలాగే బంగారం, విద్య రుణాలను ... మిగతా 8వ పేజీలో

సీకరి ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

- సెలవులకు మూడు రోజుల క్రితం ఇంటికి వెళ్లిన బాలుడు
- కడుపు నొప్పి రావడంతో పీహెచ్‌సీకి తరలింపు
- వైద్యం చేస్తుండగానే..



పెదబయలు, అక్టోబరు 4: మండలానికి చెందిన సీకరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వెచ్చంగి కాంతారావు(14) అనారోగ్యంతో గురువారం రాత్రి పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మృతి చెందాడు. కాంతారావు ఈనెల ఒకటో తేదీన స్వగ్రామమైనా సీకరి పంచాయతీ చిట్టంరాయి గ్రామానికి వెళ్లాడు. మరుసటి రోజు తల్లి ముత్యాలమ్మ పాఠశాలకు వెళ్లి కుమారుడి లగేజీ తీసుకెళ్లింది. దీర్ఘకాలికంగా అనారోగ్యంతో ఉండే కాంతారావు ఇంటికి చేరుకున్న రెండు రోజులు బాగానే ఉన్నాడు. గురువారం తోటి బాలలతో ఆడుకున్నాడు. అడవికి వెళ్లి కర్రలు కూడా తెచ్చాడు. ఆ రోజు సాయంత్రం ఎప్పటిలాగే కడుపులో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు చెప్పాడు. వారు ఆటోలో రాత్రి 10 గంటల సమయంలో పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అతనికి ప్రథమ చికిత్స చేసే క్రమంలోనే మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. గతంలో కూడా కాంతారావుకు ఇలా కడుపునొప్పి రావడంతో పాఠశాల యాజమాన్యం, కుటుంబసభ్యులు కేజీహెచ్‌కు తీసుకెళ్లి నయం చేయించారు.

కొలిక్కి వచ్చిన తహసీల్దార్ల బదిలీలు

పాడేరు డివిజన్‌లో 15 మందికి పోస్టింగ్

- మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి ముగ్గురే రాక
- ఇక్కడున్న తొమ్మిది మంది, మరో ముగ్గురు డీటీలతో సర్దుబాటు



అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో తహసీల్దార్ల బదిలీల వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. వాస్తవానికి గత నెల 22వ తేదీ నాటికే జిల్లాలో తహసీల్దార్ల బదిలీలు పూర్తి కావాల్సి ఉండగా.. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి ఎవరూ రాకపోవడంతో ఈప్రక్రియ ఆలస్యమైంది. వాస్తవానికి ఏజెన్సీకి పది మంది తహసీల్దార్లు ఇతర ప్రాంతాల నుంచి రావాల్సి ఉండగా.. కేవలం ముగ్గురు మాత్రమే వచ్చారు. ఈ సమస్యపై గత నెల సెప్టెంబరు 26న 'ఆంధ్రజ్యోతి'లో 'ఏజెన్సీకి రావాలంటే వెనుకడుగు' శీర్షిక ప్రత్యేక కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో మైదాన ప్రాంతం నుంచి వచ్చిన ముగ్గురు, మన్యంలో ప్రస్తుతం ఉన్న తొమ్మిది మంది తహసీల్దార్లు, ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లను సర్దుబాటు చేసి ఎట్టకేలకు పాడేరు రెవెన్యూ డివిజన్‌లో తహసీల్దార్ల బదిలీల ప్రక్రియను ముగించారు. ఈ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ చాకచక్యంగా వ్యవహరించారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

పాడేరు తహసీల్దార్ల త్రినాథరావునాయుడు

జిల్లా కేంద్రం పాడేరు తహసీల్దార్‌గా వంజంగి త్రినాథరావునాయుడు, జి.మాడుగుల తహసీల్దార్‌గా వి.లచ్చాపాత్రుడు, సబ్‌కలెక్టర్ ... మిగతా 8వ పేజీలో

223 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు
- మరో ముగ్గురు పరారీ
- ఆటో, రెండు సెల్‌ఫోన్లు సీజ్



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

సీలేరు, అక్టోబరు 4: ఒడిశా నుంచి మహారాష్ట్ర తరలిస్తున్న 223 కిలోల గంజాయిని అల్లూరి సీలేరు పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ముగ్గురు పట్టుబడగా, మరో ముగ్గురు పరారయ్యారు. సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ పప్పులూరు పంచాయతీ కప్పతొట్టి నుంచి సీలేరు మీదుగా గంజాయి రవాణా అవుతుందని పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ మేరకు ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గుంటవాడ జలాశయం వద్ద మాటు వేశారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒడిశా నుంచి సీలేరు వైపు వస్తున్న ఆటోను చూసి పోలీసులు అప్రమత్తం కాగా, దీన్ని దూరం నుంచే గమనించిన డ్రైవర్ కొంత దూరంలోనే ఆపి పారిపోయేందుకు యత్నించాడు. అయితే పోలీసులు అప్రమత్తమై ఆటోలో ఉన్న ముగ్గురిని పట్టుకోగా, మరో ముగ్గురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారిని విచారించగా మహారాష్ట్రలోని బుల్దారా జిల్లావాసి (ప్రధాన నిందితుడు) గంజాయి కావాలని చెప్పడంతో గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ చల్లనిశిల్ప గ్రామానికి చెందిన ఐదుగురు గిరిజనులు, ధారకొండ పంచాయతీ చెక్కలమద్దికి చెందిన ఆటో డ్రైవర్‌తో కలిసి ఒడిశా వెళ్లి 223 కిలోల గంజాయి కొనుగోలు చేసినట్టు తేలింది. పరారైన ముగ్గురితోపాటు గంజాయి అడిగిన మహారాష్ట్ర వాసిని, విక్రయించిన ఒడిశా వాసిని పట్టుకోవాల్సి ఉన్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మరోసారి తెరపైకి ఐఐటీ హోదా

2005-07 ప్రాంతంలో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఐఐటీ హోదా ఇచ్చేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం

- సీట్లన్నీ నేషనల్ పూల్‌లోకి వెళ్లిపోతాయనే ఉద్దేశంతో అప్పట్లో నిరాకరించిన రాష్ట్ర ప్రభుత్వం, వర్సిటీ
- తాజాగా సీఐఐ సదస్సులో మంత్రి లోకేశ్ ముందు ఐటీ పరిశ్రమల నిర్వాహకుల ప్రస్తావన
- ఈసారి ఏం జరుగుతుందోనని క్యాంపస్‌లో చర్చ
- ఉన్నత విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామంటున్న వర్సిటీ అధికారులు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): **ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలకు ఐఐటీ హోదా (ఐఐటీ తత్సమాన విద్యా సంస్థగా గుర్తింపు) కల్పించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కొద్దిరోజుల కిందట నగరంలో జరిగిన సీఐఐ సదస్సుకు హాజరైన మంత్రి నారా లోకేష్ ఎదుట కొందరు ఐటీ రంగ నిపుణులు ఈ ప్రతిపాదనను ఉంచినట్టు చెబుతున్నారు. దీనిపై ప్రస్తుతం విద్యావేత్తల్లో జోరుగా చర్చ సాగుతోంది.**

సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఐఐటీ హోదా ఇచ్చేందుకు 2005-2007 ప్రాంతంలోనే కేంద్ర ఉన్నత విద్యా మంత్రిత్వశాఖ ముందుకువచ్చింది. దేశంలోని ఏడు పురాతన, ఉన్నత స్థాయి ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న కాలేజీలకు ఐఐటీ హోదా ఇవ్వాలని నాడు ఎస్‌కే జోషి కమిటీ సిఫారసు చేసింది. ఎస్‌కే జోషి కమిటీ సిఫారసులపై కేంద్రం నాడు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖలతో చర్చించింది. అయితే ఐఐటీ హోదా వస్తే ఇంజనీరింగ్ సీట్లన్నీ సెంట్రల్ పూల్‌లోకి వెళ్లిపోతాయని, దానివల్ల రాష్ట్రంలోని విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, ఏయూ తిరస్కరించాయి. బెనారస్ హిందూ యూనివర్సిటీతో పాటు రెండు, మూడు యూనివర్సిటీలు ఆ ప్రతిపాదనను అంగీకరించాయి. మిగిలిన వర్సిటీలన్నీ తిరస్కరించాయి. దీంతో మరోసారి కేంద్ర ఉన్నత విద్యాశాఖ ఆనంద్‌కృష్ణన్ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ ప్రత్యామ్నాయంగా మరో ప్రతిపాదన చేసింది. అదే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఈఎస్‌టీ) హోదా. ఈ హోదా వస్తే సగం రాష్ట్రస్థాయిలో, సగం సీట్లు నేషనల్ పూల్‌లో భర్తీ చేసుకునే ... మిగతా 8వ పేజీలో

టీడబ్ల్యూ డీడీకి షాక్

రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశం

- గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ
- జాముగుడ బాలికల ఆశ్రమంలో ఫుడ్ పాయిజన్‌కు బాధ్యుడిగా పేర్కొన్న డైరెక్టర్



పాడేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావును రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ భార్గవి గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ఆగస్టు 30న డుంబ్రిగుడ మండలం జాముగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు ఆయన నిర్లక్ష్యమే కారణమని, అందుకు బాధ్యత వహిస్తూ తక్షణమే హెడ్‌క్వార్టర్‌కు రిపోర్ట్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే స్థానిక టీడబ్ల్యూ డీడీగా ఏటీడబ్ల్యూవోకు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఆగస్టు నెలలో జరిగిన ఘటనపై ఇప్పుడు డీడీని బాధ్యుడ్ని చేస్తూ హెడ్‌క్వార్టర్‌కు రిపోర్టు కావాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

సూపరింటెండెంట్ మార్పుతో మరో వివాదం

స్థానిక గిరిజన సంక్షేమ విద్యాశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గిరిజన ఉద్యోగిని ఆ సీటు నుంచి తప్పించి, మరో విభాగానికి మార్చేశారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన మరో సూపరింటెండెంట్‌ను డిప్యూటీ ఆ సీటులో కూర్చోబెట్టడంపై ఈ శాఖలో మరో వివాదం రేగుతున్నది. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఏమనుకున్నారో తెలియదు గాని, అకస్మాత్తుగా స్థానిక సూపరింటెండెంట్‌ను ఐటీడీఏలోనే మరో విభాగానికి మార్చేశారు. అకారణంగా గిరిజన ఉద్యోగిని సూపరింటెండెంట్ పోస్టు నుంచి తప్పించారని, ఆయన్నే కొనసాగించాలని గిరిజన ఉద్యోగులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పాడేరు డీఎఫ్‌వోగా సందీప్‌రెడ్డి

పాడేరు, అక్టోబరు 4: అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా అటవీ శాఖ అధికారిగా పతకంశెట్టి వెంకట సందీప్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడప డీఎఫ్‌వోగా ఉన్న సందీప్‌రెడ్డిని ఇక్కడ నియమించింది. ఇక్కడ డీఎఫ్‌వోగా పనిచేసిన కె.వినోద్‌కుమార్‌ను ఇప్పటికే బదిలీ అయ్యింది.

రెయిన్ గేజ్‌పై నిర్లక్ష్యమేలా?

ఏవోబీలో అత్యంత ఎత్తైన ప్రాంతంగా గుర్తింపు

- ప్రకృతి అందాల సమాహారం
- ఎప్పుడూ చల్లని వాతావరణం
- శరీరాన్ని తాకుతూ వెళ్లే మంచు మేఘాలు
- ఓవైపు అడవులు.. మరోవైపు పచ్చటి పొలాలు
- పర్యాటక సీజన్‌లో పెద్ద సంఖ్యలో తరలివస్తున్న పర్యాటకులు
- అభివృద్ధిపై దృష్టి సారించని ఐటీడీఏ, అటవీ, పర్యాటక శాఖలు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 4: **ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో అత్యంత ఎత్తైన ప్రాంతంగా గుర్తింపు పొందిన రెయిన్ గేజ్ అభివృద్ధికి దూరమైంది. సీలేరు-చింతపల్లి ప్రధాన రహదారి సప్పర్ల ఘాట్‌పై రెయిన్ గేజ్ ఉంది. ఈ మార్గంపై ప్రయాణించే పర్యాటకులు కొంతసేపు ఆగి ప్రకృతి అందాలను ఆస్వాదించి వెళుతుంటారు. అటువంటి ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా ఐటీడీఏ, అటవీ, పర్యాటక శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి.**

ఏవోబీలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంగా రెయిన్ గేజ్‌ను 35 ఏళ్ల క్రితం అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఇది రిజర్వ్‌డ్ ఫారెస్టు పరిధిలో ఉంది. బంగాళాఖాతానికి 3,800 అడుగుల ఎత్తులో ఉందని, ఏవోబీలోనే అత్యంత ఎత్తైన ప్రాంతమని అటవీ శాఖ అధికారులు గుర్తించారు. అప్పట్లో ఈ ప్రాంతంలో వర్షపాతం కొలిచే పరికరాలు ఉండేవి. అందుకే ఈ ప్రాంతానికి రెయిన్ గేజ్ అని పేరు వచ్చింది.



రెయిన్ గేజ్ వద్ద శిథిలావస్థకు చేరిన హట్

ఇక్కడ వర్షపాతం కొలిచే విధులను అటవీ శాఖ ఉద్యోగులే నిర్వహించేవారు. కాలక్రమేణా వర్షపాతం కొలిచే అత్యాధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రెయిన్ గేజ్ వద్ద వర్షపాతం కొలిచే పరికరాలను అటవీ శాఖ అధికారులు తొలగించారు. ఇక్కడ పర్యాటకులు విశ్రమించేందుకు అప్పట్లో గడ్డితో అటవీ శాఖ అధికారులు హట్ నిర్మించి, కూర్చోవడానికి చెక్కతో బెంచీలను ఏర్పాటు చేశారు. 15 ఏళ్ల క్రితం ఈ హట్‌ని ఆధునీకరించారు. రేకులు, ఐరన్‌తో హట్ నిర్మించి, పర్యాటకులు కూర్చోవడానికి అనువుగా సిమెంట్ బెంచీలు నిర్మించారు. దీంతో రెయిన్ గేజ్ కూడా ఒక పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఇక్కడ కూడా చాపరాయి ఉండడంతో కార్తీక మాసంలో ఈ ప్రాంతీయులు వన భోజనాలను ఆచరిస్తున్నారు. అలాగే సీలేరు, ధారకొండ సందర్శించే పర్యాటకులు సైతం ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు.

రెయిన్ గేజ్ ప్రత్యేక ఏమిటీ?

రెయిన్ గేజ్ వద్ద వాతావరణం అన్ని కాలాల్లోనూ చల్లగా ఉంటుంది. శీతాకాలంలో ఎప్పుడూ మంచు మేఘాలతో కప్పుకుని ఉంటుంది. శ్వేత వర్ణం కలిగిన మంచు మేఘాలు శరీరాన్ని తాకుతూ ప్రయణిస్తుంటాయి. లంబసింగి మాదిరిగా అత్యల్ప ... మిగతా 8వ పేజీలో

పక్కాగా అర్జీల పరిష్కారం

▸▸ కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం.. మీ కోసంలో 177 వినతులు

పాడేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించే అర్జీల పరిష్కారంలో అధికారులు పక్కాగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అధికారులు ప్రతీ రోజూ వెబ్‌సైట్‌ను పరిశీలించి మీ కోసం అర్జీల స్థితిగతులపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వినతులు సమర్పించిన ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు సేవలందించాలన్నారు.

177 వినతులు స్వీకరణ

ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌వో బి.పద్మావతి ప్రజల నుంచి 177 వినతులను స్వీకరించారు. డుంబ్రిగుడ మండలం తూటంగి పంచాయతీ బుడ్డింగి గ్రామస్థులు కె.దాసుబాబు, పి.కామేశ్వరరావు జర్రాయి నుంచి బుడ్డింగి గ్రామానికి తారురోడ్డు నిర్మించాలని కోరగా, అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ కాకరపాడు గ్రామానికి చెందిన కిల్లో గురుమూర్తి ఎగువశోభ నుంచి కాకారపాడు వరకు తారురోడ్డు నిర్మించాలని కోరారు. కొయ్యూరు మండలం బూదరాళ్లలోని రేషన్ డిపో పరిధిలో ఉన్న చౌడుపల్లి, సామలపాలెం, బొడ్డుమామిడి, కిండంగి, కొర్రపాడు, దొడవగొయ్యి గ్రామస్థులు చౌడుపల్లి గ్రామంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈలు డీవీఆర్‌ఎం.రాజు, కె.వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, పరిశ్రమల శాఖ డీఎం శ్రీవాణిధర్‌రామన్ పాల్గొన్నారు.

యూబీఐలో లింక్ ఫెయిల్‌తో నిలిచిన సేవలు

▸▸ రెండు వారాలుగా ఇదే దుస్థితి.. పట్టించుకోని అధికారులు



గేటుకు లింక్ ఫెయిలైందని వేలాడదీసిన బోర్డు

పాడేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరు యూనియన్ బ్యాంక్‌లో ఇంటర్నెట్ లింక్ ఫెయిల్ కారణంగా బాంకు సేవలు నిలిచిపోయాయి. దీంతో గత రెండు వారాలుగా ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. లింక్ ఫెయిల్ కారణంగా స్థానిక యూబీఐలో లావాదేవీలు జరగకపోవడంతో సదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను బ్యాంకు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న మరో బ్రాంచ్‌కు ఖాతాదారులను పంపించి పనికానిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం వచ్చే వారికి సాయంత్రానికిగాని పని జరగడం లేదని ఖాతాదారులు ఆవేదన చెందుతున్నారు. యూబీఐ ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యలపై వెలుగు వీవోఏల ఆందోళన


ఐటీడీఏ ఎదుట నినాదాలు చేస్తున్న వెలుగు వీవోఏలు

పాడేరు రూరల్, అక్టోబరు 4: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వెలుగు వీవోఏల ఆందోళనకు దిగారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆర్.భాను మాట్లాడుతూ వెలుగు వీవోఏలకు అమలు చేస్తున్న కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షలు గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని, గ్రామ సంఘం నుంచి చెల్లించాల్సిన రూ.8 వేలు బకాయిలు చెల్లించాలని, గుర్తింపు కార్డు యూనిఫాంతో ఇవ్వాలని, ప్రభుత్వ యాప్‌లపై అవగాహన కల్పించాలని, అధికారుల వత్తిడి తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారాలు కూడా ఆందోళన కొనసాగిస్తామని ఆమె తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: ఎస్ఐ


కూరగాయ దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ, అక్టోబరు 4: మండలంలో పలుచోట్ల జరిగే వారపు సంతల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. మండలంలోని అరకు సంతబయలులో శుక్రవారం సంతలో ఆయన పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకుని కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసిన గిరిజనులతో మాట్లాడారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నందున రోడ్డుకు 10మీటర్ల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అనవసరంగా బయట తిరగొద్దు

ముంచంగిపుట్టు, అక్టోబరు 4: రాత్రి వేళల్లో అనవసరంగా ఎవరూ బయట సంచరించరాదని, అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ కె.రవీంద్ర స్పష్టం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే ఇంటింటికీ వెళ్లి సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా మండలంలో నెలకొన్న పరిస్థితుల దృశ్య రాత్రి 11 గంటలు దాటిన తరువాత పనిలేకుండా ఎవరూ బయట తిరగరాదని సూచించారు. అత్యవసర పనుల నిమిత్తం మాత్రమే బయటకు రావాలన్నారు. రాత్రి వేళల్లో బయట తిరిగితే గంజాయి స్మగ్లర్లు, వాహన దొంగలుగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

181 కిలోల గంజాయి పట్టివేత

▸▸ నలుగురు అరెస్టు... మరొకరు పరారీ

కృష్ణాదేవిపేట, అక్టోబరు 4:

గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పోలీసులు 181 కిలోల గంజాయితో నలుగురిని అరెస్టు చేశారు. మరొకరు పరారయ్యారు. గంజాయితోపాటు ఆటోను సీజ్ చేశారు. దీనికి సంబంధించి ఇన్‌చార్జి ఎస్ఐ సీహెచ్.భీమరాజు తెలిపిన వివరాలిలా వున్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి కృష్ణాదేవిపేట మీదుగా మైదాన ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అం దింది. దీంతో ఇన్‌చార్జ్ ఎస్ఐ భీమరాజు, పోలీసు సిబ్బంది కలిసి అల్లూరి సీతారామరాజు పార్కువద్ద శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. కొద్దిసేపటి తరువాత నడింపాలెం వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపి సోదాలు చేశారు. ప్లాస్టిక్ గోనె సంచుల్లో గంజా యిని రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఆటోలో వున్న నలుగురిని అదుపు లోకి తీసుకున్నారు. అప్పటికే ఒక వ్యక్తి పరారయ్యాడు. గంజాయిని తూకం వేయించి 181 కిలోలు వున్న నిర్ధా రించారు. గంజాయి రవాణా చేస్తున్న కొయ్యూరు మం డలం శరమండ గ్రామానికి చెందిన గెమ్మిల రవి, గెమ్మిల కిరణ్, గూడెంకొత్తవీధి మండలం కొండపల్లి గ్రామానికి చెందిన తంబేలి మల్లేశ్, చింతపల్లి మండలం వట్టిబూసుల గ్రామానికి చెందిన పాంగి శాంతిగా గుర్తిం చారు. ఆటోతో పాటు నాలుగు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.10 లక్షలు ఉంటుందని నిందితులపై కేసు నమోదు చేసి విశాఖ కోర్టుకు తరలించామని ఎస్ఐ భీమరాజు తెలిపారు.

పాడేరు మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

భారీగా స్తంభించిన వాహనాలు

అరగంటకొకసారి నిలిచిన ట్రాఫిక్.. రోజంతా ఇదే సమస్య

పగటి పూట కాలువలు, రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో తిప్పలు


పీటీడీ కాంప్లెక్స్ సమీపంలో భారీగా నిలిచిన వాహనాలు

పాడేరు రూరల్, అక్టోబరు 4: జిల్లా కేంద్రం పాడేరు ప్రధాన రహదారిలో పీటీడీ కాంప్లెక్స్, ఐటీడీఏ కార్యాలయం సమీపంలోని పీఎంఆర్సీ జంక్షన్ వద్ద శుక్రవారం పలు పర్యాయాలు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రతీ అరగంటకు ఒకసారి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పీఎంఆర్సీ జంక్షన్‌లో ప్రధాన రహదారికి పక్కనే ఉన్న సైడ్ కాలువలపై ఆక్రమణలు పెరిగిపోవడంతో రహదారి అధ్వానంగా మారింది. దీంతో అధికారులు రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను పగలు చేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి ఇటువంటి మరమ్మతు పనులు రాత్రి సమయంలో చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

మోదకొండమ్మ ఆలయంలో అన్నసమారాధన

పాడేరు రూరల్, అక్టోబరు 4: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అయంలో శుక్రవారం చేపట్టిన అన్నసమారాధన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన సుమారు 350 మంది భవానీ మాలదారులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అసిస్టెంట్ డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, వెంకటతేజ త్రినాథరావు ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, సభ్యులు బీవీ.రమణ, కొణతాల సతీష్, డి.రాము, హరి, జి.శంకరరావు, కె.చంద్రమోహన్, కుమార్‌నాయుడు, ఎల్.రత్నాబాయ్, జి.ప్రకాశరావు, కారం దేముళ్ల, కె.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోండి

పాడేరు రూరల్, అక్టోబరు 4: పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎక్సైజ్ సీఐ టీవీపీఎస్ఎస్.ఆచారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం విధానం ప్రకారం పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాడేరులో నాలుగు, జి.మాడుగుల మండలంలో రెండు, హుకుంపేటలో ఒకటి, పెదబయలులో రెండు, ముంచంగిపుట్టులో ఒక దుకాణం ఏర్పాటు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఉత్సాహం కలిగిన వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఒక్కొక్క దుకాణానికి రూ.2 లక్షలు రుసుం చెల్లించాలన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 11వ తేదీన లాటరీ విధానంలో దుకాణాలు కేటాయించనున్నట్టు ఆయన తెలిపారు.

చింతపల్లిలో ఆరు దుకాణాలకు...

చింతపల్లి: సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మద్యం దుకాణాలకు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ జె.కూర్మారావు తెలిపారు. శుక్రవారం సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో ఐదు దుకాణాలు ఉండగా, అదనంగా జీకే.వీధికి మరొకటి మంజూరైనట్టు చెప్పారు. చింతపల్లి మండలంలో మూడు, జీకే వీధిలో రెండు, కొయ్యూరులో ఒక మద్యం దుకాణాల కోసం ఆసక్తిగల వారు నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు అందజేయాలన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి మద్యం నూతన మద్యం దుకాణాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్ఐ కరుణప్రసాద్, కానిస్టేబుళ్లు రమేశ్, నాయుడు ఉన్నారు.

జీవో-3 పునరుద్ధరణకు తీర్మానించండి

పాడేరు రూరల్, అక్టోబరు 4: మండలంలోని 26 పంచాయతీల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో జీవో నంబరు-3 పునరుద్ధరణ కోసం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించాలని గిరిజన సంఘం జిల్లా నేత పాలికి లక్కు డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నంబరు-3 లేకపోవడంతో గిరిజన విద్యావంతులు నిరుద్యోగులుగా ఉంటున్న విషయాన్ని ప్రజాప్రతినిధులు గుర్తించాలన్నారు. అర్హులైన గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు లభించాలంటే జీవో నంబరు-3 పునరుద్ధరణ ఎంతో అవసరమన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సోమెల చిట్టిబాబు, నాయకులు డూరు బొజ్జన్న, మజ్జి వెంకటరమణ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రికి ప్రశంసాపత్రం

జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము

అరకులోయ, అక్టోబరు 4: అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఎఎస్) వారు గుర్తించి ప్రశంసాపత్రం ప్రకటించారు. ఎన్‌క్యూఎస్ ఏహెచ్.1034 ఏపి నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసి ప్రశంసాపత్రాన్ని కలక్టర్‌కు పంపారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సమిష్టి కృషి మేరకు ఈ ప్రశంశాపత్రాన్ని ప్రకటించారు. పాడేరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ చేతుల మీదుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాము శుక్రవారం ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

సాగు సమస్యల పరిష్కారానికి ఫార్మర్ చాట్ యాప్

చింతపల్లి, అక్టోబరు 4: ఆదివాసీ రైతులకు సాగులో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించేందుకు ఫార్మర్ చాట్ యాప్‌ను వినియోగించాలని డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్ సూచించారు. మండలంలోని చౌటపాడు గ్రామంలో శుక్రవారం రైతులకు ఫార్మర్ చాట్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు వ్యవసాయంలో అధిక లాభాలు, నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు చింతపల్లి, అరకులోయ మండలాల్లో పనిచేస్తున్నామన్నారు. రైతులకు సాగులో పాటించాల్సిన మెళకువలు, శాస్త్రీయ పద్ధతులు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రైకార్ బోర్డు కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన ట్రైకార్ బోర్డు చైర్మన్, డైరెక్టర్లు

పాడేరు రూరల్, అక్టోబరు 4: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేటాయించిన నామినేటడ్ పదవులు కైవసం చేసుకున్న ట్రైకార్ బోర్డు చైర్మన్‌గా బొరగం శ్రీనివాసులు, ట్రైకార్ బోర్డు డైరెక్టర్లుగా అల్లూరి జిల్లాకు చెందిన కూడా కృష్ణారావు, మన్యం జిల్లాకు చెందిన పి.లావణ్య, నెల్లూరు జిల్లాకు చెందిన టి.అనూరాధ శుక్రవారం విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ మేనేజింగ్ డైరెక్టర్, ఎన్డీఏ కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

హుకుంపేట, అక్టోబరు 4: రెవెన్యూ శాఖ అధికారులతో కుమ్మక్కై రైతుల భూములు ఆక్రమిస్తున్న ఉపాధ్యాయుడు త్రినాథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కొండలరావు, పలువురు సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతులతో కలిసి పాడేరు ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో శుక్రవారం డీఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు త్రినాథ్ అనారోగ్యం పేరిట సెలవు పెట్టి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారన్నారు. నకిలీ రికార్డులతో రూ.60 కోట్ల విలువైన 33.16 ఎకరాలు కబ్జా చేశారన్నారు. ఈ విషయంలో హుకుంపేట, కొంతిలి, సూకురు, సంతరి పంచాయతీ రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు. డీఆర్‌వో స్పందిస్తూ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ కష్ణారావుకు ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు సాగరి సుబ్బారావు, సర్పంచులు చిట్టిబాబు, పూర్ణిమ, వెంకటరమణ, పాండురంగస్వామి, నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు నైని సత్తిబాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించరూ..

డుంబ్రిగుడ, అక్టోబరు 4: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని అరకు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి కోరారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. విజయవాడలోని ఆత్మకూరు టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన టీఎన్‌టీయూసీ కమిటీ సమావేశంలో గిరిజన కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై చర్చించామన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను క్రమబద్ధీకరించకుండా చేయకుండా మోసగించిందని, ఈ స్థితిలో కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరినట్టు ఆయన వివరించారు.

ఎ.ధారకొండ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీలేరు, అక్టోబరు 4: ఎ.ధారకొండ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు, సీపీఎం మండల నేత అంపురంగి బుజ్జిబాబు కోరారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఏ గ్రామానికి రహదారి సౌకర్యం లేదని వాపోయారు. 13 గ్రామాల్లో కనీసం సీసీ రోడ్డు కూడా లేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముర్ల సత్యవతి, ఉపాధి పథకం ఏపీవో పాల్గొన్నారు.

మాదిమళ్లులో ప్రత్యేక వైద్య శిబిరం

సీలేరు, అక్టోబరు 4: ధారకొండ ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాదిమళ్ల గ్రామంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ డీకే హిమబిందు 64 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా జ్వరంతో బాధపడితే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.బావకుమారి, ఏఎన్‌ఎం మత్యకొండసీత పాల్గొన్నారు.

మరోసారి తెరపైకి ఐఐటీ హోదా

... 7వ పేజీ తరువాయి

వెనులుబాటు కల్పించవచ్చునని పేర్కొంది. అయితే, దీనికి ఉన్నత ఉన్నత విద్యా శాఖ, ఏయూ అధికారులు అంగీకరించలేదు. దీంతో ఐఐటీ, ఐఐఈఎస్‌టీ హోదాలు మరుగున పడిపోయాయి. తాజాగా విద్యా శాఖా మంత్రి వద్ద సీఐఐ ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించడంతో మరోసారి ఐఐటీ హోదాపై చర్చ జరుగుతోంది.

ఐటీ రంగ అభివృద్ధికి దోహదం..

మంత్రి నారా లోకేష్ దృష్టికి సీఐఐ ప్రతినిధులు ఈ అంశాన్ని తీసుకువెళ్లడానికి అనేక అంశాలు కారణంగా చెబుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీకి ఐఐటీ హోదా వస్తే ఐటీ రంగం జోరు పెరుగుతుందంటున్నారు. ఐఐటీ హోదా కలిగిన కాలేజీలు ఉన్నచోట రీసెర్చ్ సెంటర్లు, రీసెర్చ్ హబ్స్ వంటివి ఏర్పాటవుతాయి. దీనివల్ల ఐటీ రంగానికి పెద్దఎత్తున బూమ్ వస్తుంది. అదే సమయంలో ఎంఎన్‌సీ కంపెనీలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ ఉద్దేశంతో ఐటీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ విషయాన్ని మంత్రి వద్ద ప్రస్తావించినట్టు చెబుతున్నారు. అదే సమయంలో కేంద్రం నుంచి భారీగా నిధులు కూడా వస్తాయి. దీనిపై ఉన్నత విద్యాశాఖ అధికారులతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

ఇబ్బందులతోనే దూరం..

ఐఐటీ హోదా వస్తే ఇంజనీరింగ్ కాలేజీలోని సీట్లన్నీ పూర్తిగా సెంట్రల్ పూల్‌లోకి వెళ్లిపోతాయి. దీంతో స్థానిక (రాష్ట్ర) విద్యార్థులు దేశవ్యాప్తంగా విద్యార్థులతో పోటీ పడి సీట్లు సాధించాల్సి ఉంటుంది. ఇది రాష్ట్రంలోని విద్యార్థులకు కొంత ఇబ్బందికరంగా మారుతుంది. జాతీయస్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలోని విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న అతి పెద్ద కాలేజీకి ఐఐటీ హోదా కల్పిస్తే లోకల్ విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందనే వాదన కూడా ఉంది. అందుకే ఈ విషయంలో వర్సిటీ అధికారులు వెనక్కి తగ్గుతున్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావును వివరణ కోరగా గతంలో ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ప్రస్తుతా నికి తాము ఎటువంటి ప్రతిపాదనలు పెట్టలేదన్నారు. దీనిపై ఉన్నత విద్యా శాఖ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు.

రుణాల వసూలు నిలుపుదల

... 7వ పేజీ తరువాయి

జిల్లాలో ఆశించిన స్థాయిలో అందించడం లేదని, వాటి సంఖ్య పెంచేందుకు కృషి చేయాలన్నారు. అలాగే అంతర పంటలు వేసే రైతులకు రెండు రుణాలు అందించేందుకు కృషి చేయాలని, కాఫీ, మిరియాల రైతులకు పంట రుణాలు అందించాలన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ పశు, మత్స్య, ఉద్యానవన రైతులకు రుణాలను ఇవ్వాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించే వివిధ పథకాలకు సంబంధించిన రుణాలను అందించాలని కలెక్టర్ సూచించారు. గిరిజన రైతులకు పంట రుణాలపై సంపూర్ణ అవగాహన కల్పించి ప్రోత్సాహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఎల్‌డీఎం మాతునాయుడు, యూనియన్ బ్యాంక్ కన్వీనర్ జీవీబీడీ.హరిప్రసాద్, ఎస్‌బీఐ ఆర్‌ఎం అభిషేక్, వివిధ బ్యాంకుల అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెయిన్ గేజ్‌పై నిర్లక్ష్యమేలా?

... 7వ పేజీ తరువాయి

ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. అయితే ఇక్కడ ఉష్ణోగ్రతలు కొలిచే యంత్ర పరికరాలు అందుబాటులో లేవు. ఇక్కడ నుంచి ఎటుచూసినా అడవులు కనిపిస్తుంటాయి. దిగువ ప్రాంతంలో పంట పొలాలు కనిపిస్తాయి. ప్రకృతి అందాలు అమితంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో ప్రధానంగా ఇక్కడ ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్‌లు కూడా ఇక్కడ జరుగుతున్నాయి.

అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగకరం..

రెయిన్ గేజ్‌ని అభివృద్ధి చేస్తే పర్యాటక పరంగా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది. సందర్శకులు కూర్చోడానికి బెంచీలు, చిన్న చిన్న హట్‌లు ఏర్పాటు చేయాలి. ఆ ప్రాంతం చుట్టూ ఇనుప రెయిలింగ్ వేస్తే ప్రకృతి అందాలు, లోయలను పర్యాటకులు తిలకించవచ్చు. మరుగుదొడ్లు నిర్మించాలి. ఐటీడీఏ, అటవీ, పర్యాటక శాఖల అధికారులు స్పందించి రెయిన్ గేజ్‌ని అభివృద్ధి చేస్తే ఒక ఎకో టూరిజం స్పాట్‌గా రూపుదిద్దుకోనుంది.

కొలిక్కి వచ్చిన తహసీల్దార్ల బదిలీలు

... 7వ పేజీ తరువాయి

కార్యాలయం పరిపాలనాధికారిగా టి.చిరంజీవిపడాల్, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌లు బి.చిన్నికృష్ణ, సీహెచ్.తిరుమలరావులను అదే స్థానాల్లో కొనసాగిస్తున్నారు. అలాగే అనకాపల్లి జిల్లా మాకవరపాలెం నుంచి వచ్చిన ఎంవీవీ.ప్రసాద్‌ను అరకులోయకు, స్థానిక కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్ బి.నాగరాజును అనంతగిరికి, పాయకరావుపేట నుంచి వచ్చిన కె.జయప్రకాశ్‌ను డుంబ్రిగుడకు, చింతపల్లి తహసీల్దార్ టి.రామకృష్ణను జీకేవీధికి, జీకేవీధిలోని ఎస్ఎల్‌వీ.ప్రసాద్‌ను పెదబయలుకు, సబ్బవరం నుంచి వచ్చిన బి.రవికుమార్‌ను చింతపల్లికి తహసీల్దార్లుగా నియమించారు. అలాగే హుకుంపేట, కొయ్యూరు, ముంచంగిపుట్టుల్లో తహసీల్దార్లుగా ఆయా మండలాల్లో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లుగా సీహెచ్.కృష్ణారావు, వి.కుమారస్వామి, ఆర్‌వీఎస్ఎల్.నర్సమ్మలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాలకు తహసీల్దార్లు అందుబాటులో ఉన్నట్టేనని రెవెన్యూ అధికారులు తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

టీడబ్ల్యూ డీఈఈగా రఘునాథరావు



చింతపల్లి, అక్టోబరు 4: గిరిజన సంక్షేమ శాఖ డీఈఈగా జి.రఘునాథరావునాయుడు నియమితులయ్యారు. ఏడాదిన్నర పాటు ఇక్కడ పనిచేసిన డీఈఈ చాణిక్యరావును మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం బదిలీ చేశారు. ఆయన స్థానంలో గూడెంకొత్తవీధి ఏఈగా పనిచేస్తున్న రఘునాథరావుకు డీఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ టీడబ్ల్యూ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం

పాడేరు రూరల్, అక్టోబరు 4: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలుగా తమర్భ నాగ వెంకట హేమలత, ప్రధాన కార్యదర్శిగా రేగం సత్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరి కొంత మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్టు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువి.గిరి, శెట్టి అప్పలరాజు తెలిపారు.

అనాదీశ్వర ఆలయంలో పూజలు

చింతపల్లి, అక్టోబరు 4: మండలంలోని అంతర్ల అనాదీశ్వర ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం దసరా నవరాత్రులు పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్‌కి చెందిన వేదపండితులు రాజరాజేశ్వరిదేవిని గాయిత్రిదేవిగా అలంకరించి కుంకుమార్చన, హోమం నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు జీకే.వీధి, చింతపల్లి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం పీఠాధిపతి శివమాతాజీ, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, అమరావతి కళాశాల ప్రిన్సిపాల్ సాగిన నాగార్జున పాల్గొన్నారు.

శాస్త్రవేత్త శివకుమార్ సేవలు భేష్

చింతపల్లి, అక్టోబరు 4: ఎనిమిదేళ్ల పాటు గిరిజన ప్రాంతంలో శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ అందించిన సేవలు మరువలేమని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త చెట్టి బిందు అన్నారు. కొవ్వూరు పరిశోధన స్థానానికి శుక్రవారం బదిలీపై వెళ్తున్న శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ప్రతికూల పరిస్థితులను అధిగమించి సుదీర్ఘ కాలం గిరిజన ప్రాంతంలో పనిచేయడం గొప్ప విషయమన్నారు. ఆయన పర్యవేక్షణలో మిరియాలు, అల్లం పంటల్లో కొత్త రకాల వంగడాలపై పరిశోధనలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఉద్యాన పంటల సాగులో రైతుల ఆర్థిక ప్రగతికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, హెచ్‌ఆర్ఎస్ ఉద్యోగి దివ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు పనులకు శంకుస్థాపన

అనంతగిరి, అక్టోబర్ 4: టోకూరు పంచాయతీ జాకరవలస గ్రామంలో 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.2 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ కిల్లో మోస్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీలోని మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని, తాగునీరు, డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దొన్ను, ఉప సర్పంచ్ నర్సన్న, వార్డు సభ్యులు రామ్మూర్తి, చందరరావు, సురేష్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

చింతపల్లి, అక్టోబరు 4: మండల కేంద్రంలో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని జాతీయ రహదారి విస్తరణలో తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అల్లూరితో పాటు గాంగంటందొర, మల్లుదొర, పండు పడాల్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఐటీఐ అసోసియేషన్ డివిజన్ కమిటీ ఎన్నిక

చింతపల్లి, అక్టోబరు 4: ఏపీ ప్రభుత్వ ఐటీఐ, డీఎల్‌టీసీస్ అసోసియేషన్ చింతపల్లి డివిజన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇన్‌స్ట్రక్టర్ టి.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఎం.రాంప్రసాద్, కార్యదర్శిగా ఆర్.భుజంగరావు, సంయుక్త కార్యదర్శిగా కె.ధనుంజయ్‌రావు, కోశాధికారిగా బి.సింహాచలంను ఎన్నుకున్నారు.

గ్రామసభల్లో ఉపాధి పనుల గుర్తింపు

అనంతగిరి, అక్టోబర్ 4: గ్రామసభలతో గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలోని పనులను గుర్తించేందుకు దోహదపడుతుందని, ఏపీడీ పవన్ అన్నారు. మండలంలోని టోకూరు పంచాయతీ కేంద్రంలోగల సచివాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ కిల్లో మోస్య అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ పవన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలోని ఏ పని చేయలన్నా తప్పనిసరిగా గ్రామసభ తీర్మానం ఉండాలని, అలాగే పంచాయతీకి రూ.60 లక్షల నిధులు మంజూరు చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఉప సర్పంచ్ నర్సన్న, కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

గంజాయి, సారా నిరోధించాలి: ఎస్ఐ

కొయ్యూరు, అక్టోబరు 4: గ్రామాల్లో సారా, గంజాయి నిరోధించేందుకు కృషి చేయాలని ఎస్ఐ నాగార్జున సూచించారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల మహిళా పోలీసులు శుక్రవారం ఎస్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో కొయ్యూరు, మంప స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు ఎంపీడీవోగా డేవిడ్‌రాజు

పాడేరు రూరల్, అక్టోబరు 4: పాడేరు ఎంపీడీవోగా ఎస్.డేవిడ్‌రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కె.సాయినవీన్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ కాగా, అనకాపల్లి జిల్లా గొలుగొండలో చేస్తున్న ఎస్.డేవిడ్‌రాజును అతని స్థానంలో నియమించారు. కార్యాలయ ఏవో ఎ.మహేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేష్, సిబ్బంది శ్రీనివాస్, ఈశ్వరరావు, తదితరులు అతనికి పుష్పగుచ్ఛాలు అందించారు.

క్రైం... crime news

గొడిచెర్ల వద్ద రోడ్డు ప్రమాదం

» ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, అక్టోబరు 4 : గొడిచెర్ల హైవే వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలివి. ఎలమంచిలి మండలం రేగుపాలెం గ్రామానికి చెందిన షేక్ మదీనా (83) తన బంధువు అబ్దుల్ ఖాదర్‌తో కలిసి తుని బైక్‌పై వెళుతున్నారు. గొడిచెర్ల హైవే వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వీరిద్దరూ తీవ్ర గాయాలకు గురయ్యారు. వీరిని తుని ఆస్పత్రికి తరలించగా మదీనా మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

గాయపడిన వ్యక్తి మృతి



శేషుబాబు (ఫైల్)

నక్కపల్లి, అక్టోబరు 4: మండలంలోని మన బాలవానిపాలెం హైవే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. మనబాలవానిపాలెం గ్రామానికి చెందిన గొర్ల శేషుబాబు (50) మోపెడ్‌పై గురువారం సాయంత్రం రోడ్డు దాటుతున్నారు. ఇంతలో విశాఖపట్నం వైపు వెళుతున్న బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. వెంటనే విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

» మృతదేహాన్ని కిలోమీటరు మోసిన పోలీసులు



మృతదేహాన్ని డోలీలో మోసుకొస్తున్న పోలీసులు

పెదబయలు, అక్టోబరు 4: మండలంలోని సీతగుంట గ్రామ శివారున మత్స్యగడ్డలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సర్పంచ్ మాధవ రావు ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ప్రైవేటు వాహనంలో పాడేరు సర్వజన ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుని శరీరంపై నలుపు రంగు స్వెట్టర్, జీన్ ఫ్యాంట్ ఉన్నాయని, ఎత్తు 5.8 అంగుళాలు ఉంటాడని పోలీసు స్టేషన్ రైటర్ వరదపురెడ్డి గోవింద నాయుడు తెలిపారు. అయితే, మత్స్యగడ్డలో లభ్యమైన మృతదేహాన్ని తరలించడానికి పోలీసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఆజాద్, వీఆర్ఏ సుందర్‌దేవ్ తదితరులు సహాయ చర్యలు చేపట్టారు.

ద్విచక్ర వాహనం చోరీ

కొయ్యూరు, అక్టోబరు 4: మండలంలో బాలారం గ్రామంలో మొండెం రాజుకు చెందిన ద్విచక్రవాహనం చోరీ జరిగింది. గురువారం రాత్రి తన ఇంటికి సమీపంలో గల రామాలయం వద్ద పార్కు చేశారు. తెల్లవారు చూడగా కనిపించలేదని బాధితుడు తెలిపారు. ఇటీవలే రూ. 2.50 లక్షలతో ఈ వాహన కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ వాహనం కొయ్యూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గ్రావెల్ తవ్వుతున్న వాహనాలు సీజ్

ఎలమంచిలి, అక్టోబరు 4: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతంపై ఎలమంచిలి రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీబీతో పాటు ఆరు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. మునిసిపాలిటీ పరిధి వెంకటాపురం సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపి, తరలిస్తున్నారని ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకు వెళ్లి అర్ధరాత్రి సిబ్బందితో కలిసి దాడులు జరిపామన్నారు. తవ్వకాలు జరపుతున్న వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టివేత



ఎస్.రాయవరం, అక్టోబరు 4: మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అక్రమంగా గోవులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్టు ఎస్.ఐ విభీషణరావు తెలిపారు. ఈ సందర్భంగా 55 గోవులను స్వాధీనం చేసుకున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి నుంచి హనుమాన్ జంక్షన్ సంతకు గోవులు తరలిస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వీటిని పట్టుకున్నట్టు చెప్పారు. అనంతరం గోవులను సంరక్షణార్థం పాయకరావుపేట తరలించి రైతులకు అప్పగించామన్నారు.

నక్కపల్లి : వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా పశువులను తరలిస్తున్న లారీని నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు శుక్రవారం పట్టుకున్నారు. విజయనగరం నుంచి విజయవాడ వైపు వెళుతున్న లారీని వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పట్టుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం పశువులను సంరక్షనార్థం రైతులకు అప్పగించినట్టు చెప్పారు.

వైద్యులు ప్రజల విశ్వాసాన్ని పొందాలి

» అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్



ఇందుకూరుపేట డాక్టర్ సరస్వతికి ధ్రువీకరణపత్రం అందిస్తున్న కలెక్టర్

పాడేరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు ప్రజల విశ్వాసాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. జిల్లాలోని 17 ఆస్పత్రులు, సబ్‌సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 'నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ సాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికెట్లను శుక్రవారం ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన సేవలు అందించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయా ప్రమాణాలను గుర్తించి జిల్లాలోని ఆస్పత్రులు, ఆరోగ్య ఉపకేంద్రాలకు ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ ప్రకటించడం సంతోషకరమన్నారు. ఇదే స్ఫూర్తితో రోగుల విశ్వాసాన్ని మరింతగా పొందేలా కృషి చేయాలని వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లాలో అరకులోయ, చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రులు, చింతూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ఇందుకూరుపేట, తాజంగి, సప్పర్ల, పిడతమామిడి, జి.మాడుగుల, ఎల్లవరం, లాగరాయి, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మునిరిమల్లి, గుత్తులపుట్టు, అడుగులపుట్టు, కొత్తపాడేరు, నెల్లుపూడి, చింతూరు ఆరు హెల్త్ సబ్ సెంటర్లు ఎన్‌క్యూఏఎస్ ధ్రువీకరణ పొందాయన్నారు. ఈ సందర్భంగా ఆయా వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, డీఆర్‌వో పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539



కొత్తూరు వంతెనపై కనువిందు చేస్తున్న పొగమంచు



గొర్లెధర్మవరం వద్ద రోడ్డుపై మంచు దుప్పటి

మైదానాన్ని పలుకరించిన మంచు

అచ్యుతాపురం రూరల్, అక్టోబరు 4:

మైదాన ప్రాంతాన్ని మంచు పలుకరించింది. మన్యంలో ఏటా నవంబరు ఆరంభం నుంచి కురిసే పొగమంచు నెల రోజులు ముందుగానే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో కనువిందు చేయడంతో ప్రకృతి ప్రేమికులు పరవశించిపోయారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది అక్టోబరు నెల వచ్చినా సూర్యుడి సెగలు ఆగలేదు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ మండుతోంది. ఇటీవల భారీ వర్షాలు కురిసినప్పటికీ చల్లబడలేదు. ఉష్ణతాపంతో అల్లాడుతున్న ఈ ప్రాంత ప్రజలు శుక్రవారం కురిసిన పొగమంచును చూసి ఆశ్చర్యపోయారు. ఉదయం ఆరు గంటల నుంచి ఏడున్నర గంటల దాటే వరకు ఎదురుగా వచ్చే మనిషి సైతం కనిపించని విధంగా మంచు ఆవహించిన దృశ్యాలను చూసినవారు పరవశించిపోయారు. అసలే ఈ ప్రాంతం పారిశ్రామికవాడ కావడంతో ఉదయం విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, వివిధ పనులపై బయటకు వచ్చిన వారు కాస్త ఇబ్బందులు పడ్డారు. వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. దాదాపు ఎనిమిది గంటల ప్రాంతంలో మంచు తెరలను చీల్చుకుంటూ భానుడు కనిపించాడు. ఇక అప్పటి నుంచి వేడి వాతావరణం యథావిధిగా సాయంత్రం వరకు కొనసాగింది. ఏది ఏమైనప్పటికీ పొగమంచును చూసిన పలువురు ఈ సుందర దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించి తెగ సంబరపడ్డారు.



అప్పారాయుడుపాలెం సమీపంలో మంచు తెరలను చీల్చుకుంటూ సూర్యోదయం

సాగునీటి చెరువులు కళకళ

» ఖరీఫ్‌కు ఢోకా ఉండదని అన్నదాతలు ఆనందం



నీటితో కళకళలాడుతున్న పరవాడ పెద్ద చెరువు



నిండుకుండలా దర్శనమిస్తున్న ఊర చెరువు

పరవాడ, అక్టోబరు 4: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు సాగునీటి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఈ ఏడాది వేసవిలో కాసిన ఎండల కారణంగా చాలా వరకు చెరువులు చుక్కనీరు లేక అడుగంటిపోయాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు పలు చెరువుల్లో నీరు చేరడంతో నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా పరవాడలోని పెద్ద చెరువు, సన్యాసి చెరువు, పైడమ్మబంద చెరువు, గొల్లమ్మ బంద చెరువు, మూలస్వయంభూవరం, స్వయంభూవరం, కలపాక, కొత్త వెన్నెలపాలెంలో చెరువులు నీటితో నిండుగా కనిపిస్తున్నాయి. దీంతో వాటి పరిధిలోని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నీటికి ఢోకా ఉండదని చెబుతున్నారు. మున్ముందు మరిన్ని వర్షాలు కురిస్తే ఇటు కూరగాయల పంటలకు, అటు వరి పంటకు పూర్తిస్థాయిలో నీరు ఉంటుందని అంటున్నారు.

అద్భుత కథాంశాలతో అలరింపజేసిన నాటికలు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 4:

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి ప్రదర్శితమైన నాటికలు అలరించడంతో పాటు ఆలోచింపజేశాయి. గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్న... నేనొచ్చేస్తా..', అనకాపల్లి షిర్డీసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి 'మలిసంధ్య' నాటికలను అద్భుతంగా ప్రదర్శించారు. తొలుత జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్రి సన్యాసినాయుడు, భీమరశెట్టి వరహా నూకరాజు, కేఎం నాయుడు, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, పీవీ రమణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



నాన్నా... నేనొచ్చేస్తా... నాటికలో ఓ సన్నివేశం



జ్యోతి ప్రజ్వలన చేసి నాటకాలను ప్రారంభిస్తున్న భీమరశెట్టి రామకృష్ణ

ఆలోచింపజేసిన

'నాన్నా... నేనొచ్చేస్తా...'

ఈ సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు నుంచి పెళ్లి వరకు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చుకుంటూ పోతున్నారు. మితిమీరిన వాత్సల్యం, మమకారాన్ని పెంచుకుని పోనీలే మన పిల్లలేగా అని స్వేచ్ఛనిచ్చి పెంచితే దాని ఫలితం పెళ్లైన కొంతకాలానికే వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య వచ్చిన మనస్పర్థలను పరిష్కరించుకోలేకపోతున్నారు. పెళ్లంటే సర్దుబాటు, సంస్కారం అంటే దిద్దుబాటు అన్న సూత్రాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. మెట్టినింటి నుంచి పుట్టినింటికి ' నాన్నా - నేనొచ్చేస్తా ' అంటూ ప్రయాణం చేస్తున్న సుధలాంటి అమ్మాయికి, భర్త శ్రీరామ్‌కి, తల్లిదండ్రులు రాఘవ, సావిత్రిల మధ్య జరిగిన సంఘర్షణలకు దృశ్యరూపమే ఈ నాటిక. పెళ్లైన కూతురు నాన్నా-నేనొచ్చేస్తా అన్న మాటలకు స్వస్తి పలికి... నాన్నా మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారని ఆహ్వానం పలికే రోజులు రావాలి. అప్పుడే పవిత్రమైన భార్యాభర్తల బంధం బలపడి, వైవాహిక జీవితం నిత్యనూతనమై శత వసంతాలు వర్ధిల్లుతుందనే సందేశమిచ్చేదే ఈ నాటిక కథాంశం.

ఆకట్టుకున్న 'మలిసంధ్య'

జాతస్య మరణం ధ్రువం అని చెప్పాడు శ్రీకృష్ణ భగవానుడు గీతలో. మరణం ప్రతి మనిషికి వచ్చేదే.. కాకపోతే ఒకరు ముందు, ఒకరు వెనుక. ఆ లోటు ఎవరూ పూడ్చలేనిది. ప్రతి వారి జీవితంలో తొలిసంధ్య తొలకరి జల్లులా హాయిగా ఆనందంగా గడిచిపోతుంది. కానీ మలిసంధ్య చేరే సరికి ఎన్నో రకాల ఒడిదుడుకులు, కష్టనష్టాలు ఎదురు వస్తాయి. అవన్నీ దాటి హాయిగా బ్రతకాలి అంటే భార్యాభర్తలు ఒకరికొకరు ఆర్థికంగా గాని, హార్థికంగా గాని ఏ విషయాలు దాచుకోకుండా విడమరచి చెప్పుకోవాలి. భార్య లేని జీవితం భర్తకు, భర్త లేని జీవితం భార్యకు నరక ప్రాయమవుతుంది. వారిద్దరిలో ఎవరు ముందు వెళ్లిపోయినా.. ఉన్న వాళ్ల శేష జీవితాన్ని ఏ ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా గడపగలగాలి. ఒకరికి ఒకరు తోడు లేకపోయినా.. మిగిలిన ఒక్కరూ ఎలా బతకాలో అనే విషయాన్ని తన భర్తకు సంధ్య తెలియజేసిన విధానమే 'మలిసంధ్య' నాటిక కథాంశం. ఈ నాటికల్లో పాత్రదారులు తమ తమ పాత్రలకు ప్రాణం పోసి ప్రేక్షకులతో ఔరా.. అనిపించుకున్నారు.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ విస్తరణ

అనకాపల్లి జిల్లాలో 12 మండలాలకు...

విజయనగరం జిల్లాలో ఒక మండలం...

అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక రూపకల్పన

గ్లోబల్ టెండర్ల ద్వారా ఏజెన్సీ ఎంపిక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మాస్టర్ ప్లాన్‌ను విస్తరించనుంది. ఇంతకు ముందు మాస్టర్ ప్లాన్-2021-2041ను రూపొందించినప్పుడు అనకాపల్లి జిల్లాలోని 12 మండలాలను, విజయనగరం జిల్లాలో మెరకముడిదాం మండలాన్ని అందులో చేర్చలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లాపై దృష్టిసారించింది. అభివృద్ధికి వీలుగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని వీఎంఆర్‌డీఏను ఆదేశించింది.

అనకాపల్లి జిల్లాలో 24 మండలాలు ఉండగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వాటినే గతంలో మాస్టర్‌ప్లాన్ తయారీలో పరిగణనలోకి తీసుకున్నారు. మరోవైపున ఉన్న వాటిని పట్టించుకోలేదు. అందులో నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, రావికమితం, రోలుగుంట, దేవరాపల్లి, చీడికాడ, బుచ్చెయ్యపేట, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, కె.కోటపాడు మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలను ఇతర ప్రాంతాలతో కలుపుతూ మాస్టర్ ప్లాన్ తయారుచేయాల్సి ఉంది.

నాడు రూ.10 కోట్ల వ్యయంతో

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ 2021-2041ను రూ.10 కోట్ల వ్యయంతో రూపొందించారు. 2011లో అధ్యయనానికి శ్రీకారం చుట్టి 2016లో లీ అసోసియేట్స్ సంస్థకు బాధ్యత అప్పగించారు. దానికి ఆ సంస్థ రూ.10 కోట్లు వసూలుచేసింది. వైసీపీ ప్రభుత్వం త్వరగా మాస్టర్ ప్లాన్ పూర్తిచేయాలని ఒత్తిడి పెట్టడంతో పూర్తికాకపోయినా సరే 2021లో సమర్పించేసింది. దాంతో అనకాపల్లి జిల్లాలో 12 మండలాలు, అటు మెరకముడిదాం మండలానికి ప్రణాళికలు రూపొందలేదు. అయితే వాటికి సంబంధించిన ఫొటోలు, సమాచారం ఆ సంస్థ సేకరించి పెట్టుకుంది. ఇప్పుడు వాటి గురించి ప్రశ్నిస్తే తనకు నష్టం వచ్చిందని, ఇంకో నాలుగు కోట్ల రూపాయలు ఇస్తే వాటికి మాస్టర్ ప్లాన్ తయారుచేస్తానని చెబుతోంది. దాంతో అధికారులు పునరాలోచనలో పడ్డారు.

ప్రణాళికలో ఏముంటాయి?

ఆయా మండలాల్లో ఉన్న వనరులు, నీటి సదుపాయం, పంటలు, పరిశ్రమలు, జనాభా, విద్యా సంస్థలు, పర్యాటక ప్రాంతాలు, పరిశ్రమలు, రహదారులు, రైలు మార్గాలు, వాటి మధ్య అనుసంధానం, ట్రాఫిక్ ఇలాంటివన్నీ అధ్యయనం చేస్తారు. వాటి ఆధారంగా ఏ ప్రాంతంలో ఏ తరహా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయవచ్చునో సూచించి, వాటికి ఆ ప్రాంతాలను కేటాయిస్తారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, పర్యాటక ప్రాంతాలు, ఆస్పత్రులు, స్టేడియాలు, కొత్త రహదారులు, వాటి మధ్య అనుసంధానం, అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణం, సరకు రవాణాకు వీలుగా కారిడార్లు వంటివి అందులో ఉంటాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రహదారులను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తుంది. ఆ ప్లాన్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలకు భూములు కేటాయిస్తారు. పారిశ్రామిక పార్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు వంటివి వస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక అంతా అందులో ఉంటుంది.

గ్లోబల్ టెండర్ల ద్వారా ఎంపిక

-విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ



రాష్ట్ర ప్రభుత్వం ఆయా మండలాలు కూడా వీఎంఆర్‌డీఏలో ఉన్నందున మాస్టర్‌ప్లాన్‌ను విస్తరించాల్సిందిగా సూచించింది. దీనికి గ్లోబల్ టెండర్ల ద్వారా ఏజెన్సీని ఎంపిక చేయాలని అనుకుంటున్నాము. దీనివల్ల తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో ప్రభావవంతమైన ప్రణాళిక తయారువుతుందని భావిస్తున్నాము. త్వరలోనే టెండర్లు పిలుస్తాం.

నైపుణ్యాలు మెరుగుపరిచే దిశగా బోధన

క్రీడల్లో గెలుపోటములు కంటే పాల్గొనడమే ముఖ్యం

అన్యాయం జరిగినప్పుడు ఆడపిల్లలు తిరగబడేలా ఉండాలి

సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతర్‌రాష్ట్ర బాలికల కబడ్డీ, వాలీబాల్ పోటీల ముగింపోత్సవంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



విజేతలకు కప్ బహూకరిస్తున్న హోం మంత్రి అనిత

పాయరావుపేట, అక్టోబరు 4 : నైపుణ్యాలను మెరుగుపరచుకునే దిశగా విద్యాబోధన సాగాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక శ్రీ ప్రకాశ్ విద్యా సంస్థల్లో మూడు రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతర్‌రాష్ట్ర బాలికల కబడ్డీ, వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి అనిత హాజరై ప్రసంగించారు. ఆటల వలన ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. గెలుపు కంటే క్రీడలలో పాల్గొనడం చాలా ముఖ్యంగా పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివితేనే తెలివైన వారు కాదని, ఏ రంగంలో రాణించినా వారు తెలివైన వారే అని వివరించారు. అన్యాయం జరిగినప్పుడు ఆడపిల్లలు తిరగబడేలా ఉండాలన్నారు. పిల్లలు గంజాయి, డ్రగ్స్ వంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం వాటిపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాశ్ మాట్లాడుతూ ఆటల వలన విద్యార్థినులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యం పొందుతారన్నారు. అనంతరం శ్రీ ప్రకాశ్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.నరసింహారావు మంత్రి అనితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతల వివరాలు

- కబడ్డీలో అండర్-14 విభాగంలో ప్రథమ బహుమతి శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్, పాయకరావుపేట, ద్వితీయ బహుమతి న్యూ డైమెన్షన్ హైస్కూల్ భువనగిరి, తెలంగాణ.
- అండర్ -17 విభాగంలో ప్రథమ బహుమతి హీల్ స్కూల్, నరసింగపాలెం, కృష్ణా జిల్లా., ద్వితీయ బహుమతి ప్రబోధానంద ప్రశాంతినికేతన్, కొండాపూర్ తెలంగాణ.
- అండర్-19 విభాగంలో ప్రథమ బహుమతి హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఖమ్మం, ద్వితీయ బహుమతి దిహార్ట్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్ హైదరాబాద్.

వాలీబాల్ విజేతలు

- వాలీబాల్‌లో అండర్-14 విభాగంలో ప్రథమ బహుమతి సంఘమిత్ర స్కూల్ నిజాంపేట్, తెలంగాణ., ద్వితీయ బహుమతి డీఏవీ పబ్లిక్ స్కూల్, కూకట్‌పల్లి, తెలంగాణ.
- అండర్ -17 విభాగంలో ప్రథమ బహుమతి నవనీత పబ్లిక్ స్కూల్, నెల్లూరు, ద్వితీయ బహుమతి మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ అనంతపురం, ఆంధ్రప్రదేశ్.

అండర్-19 విభాగంలో ప్రథమ బహుమతి డీపీఎస్ పబ్లిక్ స్కూల్ నాచారం, తెలంగాణ. ద్వితీయ బహుమతి అక్షర విద్యాలయ, నెల్లూరు ఆంధ్రప్రదేశ్.

వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు



డీపీఈవో సుధీర్

నర్సీపట్నం, అక్టోబరు 4: నర్సీపట్నంలో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి. సుధీర్ తెలిపారు. శుక్రవారం ఆయన నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలో 136 మద్యం దుకాణాలకు సుమారు 20 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నవోదయం కార్యక్రమం పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నాటు సారా, గంజాయి నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీవైసీఎఫ్‌గా శామ్యూల్ బాధ్యతలు స్వీకరణ



ఎం.శామ్యూల్

నర్సీపట్నం, అక్టోబరు 4: డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిగా ఎం.శామ్యూల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజధాని అమరావతిలో పీసీసీఎఫ్ కార్యాలయంలో పనిచేస్తూ నర్సీపట్నానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ సంపద, వన్య ప్రాణాల సంరక్షణకు శయశక్తులా కృషిచేస్తానని చెప్పారు.

13న అప్పన్న ఆలయంలో విజయదశమి వేడుకలు

సింహాచలం, అక్టోబరు 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 13న విజయదశమి ఉత్సవం నిర్వహించనున్నట్టు అలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ జరిగే కార్యక్రమాల వివరాలను ప్రకటించారు. ప్రతిరోజూ ఉదయం శ్రీమద్రామాయణ పారాయణం, సాయంత్రం 5 గంటలకు ఆలయ బేడా మండపంలో అమ్మవార్ల తిరువీధి జరుగుతుందన్నారు. ఈనెల 9 నుంచి 13 వరకు తాయార్ల సన్నిధిలో వీర లక్ష్మీ ఆయుధ పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 13న విజయదశమి పురస్కరించుకుని సింహాద్రినాథుడు రామావతారంలో మధ్యాహ్నం 3 గంటలకు మెట్ల మార్గంలో కొండదిగువ పూదోటకు వెళ్లే జమ్మివేట ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

కోరాపుట్, అరకు సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



పనిని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 4: వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం కోరాపుట్, అరకు సెక్షన్‌లో తనిఖీ చేసి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో యార్డు, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్, ఇంజినీరింగ్ పరికరాల నిర్వహణపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి రిలీఫ్ ట్రైన్‌లోని పరికరాలను, వినియోగించే నైపుణ్య పరిజ్ఞానంతోపాటు సేఫ్టీ గాడ్జెట్‌లు, ఆపరేషన్ పద్ధతులను పరీక్షించారు. క్రూ లాబీ, రన్నింగ్ రూమ్ నిర్వహణను తనిఖీ చేశారు. దమన్‌జోడి, కోరాపుట్ స్టేషన్ల మధ్య వంతెనలు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, స్టేషన్ భవనాల మెరుగుదల, భద్రతా అంశాలను పరిశీలించారు. అక్కడ నుంచి విండో ట్రైలింగ్ ద్వారా డబ్లింగ్ లైను నిర్మాణం, వివిధ స్టేషన్లలో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్‌గుప్తా, అధికారులు పాల్గొన్నారు.